క్లుప్తంగా

కాంగ్రెస్ నాయకుల ఇంటింటి సర్వే



మోర్తాడ్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని కాంగ్రెస్ నాయకులు సర్వే చేస్తున్నారు. ఆదివారం మోర్తాడ్ మండలంలోని వడ్యాట్‌లో ఇంటింటికి తిరుగుతూ పథకాలు అందుతున్నాయా లేదా అనే వివరాలు సేకరించారు. సంక్షేమ పథకాలు అందకపోతే అందుకుగల కారణాలను విశ్లేషిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సదానందంగౌడ్, పెండెం శ్రీనివాస్, ముత్యాల శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా సభకు తరలిన బీజేపీ శ్రేణులు



ఆర్మూర్‌టౌన్/నందిపేట్/బాల్కొండ/వేల్పూర్/రుద్రూర్: జిల్లా కేంద్రంలో ఆదివారం పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభానికి వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల, కోటగిరి, పోతంగల్, రుద్రూర్ మండలాల నుంచి బీజేపీ నాయకులు, రైతులు భారీగా తరలి వెళ్లారు. రైతుల కోరిక అయినా పసుపుబోర్డు ఏర్పాటును ఎంపీ అర్వింద్ నెరవేర్చారని బీజేపీ నాయకులు అన్నారు.

అమిత్‌షాను కలిసిన మేడపాటి



బోధన్: జిల్లా కేంద్రంలో జాతీయ పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభోత్సవానికి బోధన్ నియోజకవర్గ బీజేపీ నాయకులు, రైతులు తరలి వెళ్లారు. ఈసందర్భంగా బోధన్‌కు చెందిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, వడ్డె మోహన్ రెడ్డి, అడ్లూరి శ్రీనివాస్‌లు అమిత్ షాను కలిశారు.

నవనాథపురం బ్రాహ్మణ సమాఖ్య కార్యవర్గం ఎన్నిక



ఆర్మూర్‌టౌన్ : పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో నవనాథపురం బ్రాహ్మణ సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పారిపల్లి కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా జెండా వెంకటేష్ శర్మ, ఉపాధ్యక్షుడిగా సుధీర్‌శర్మ, కోశాధికారిగా కిషోర్‌శర్మ, సంయుక్త కార్యదర్శి వినీత్ శర్మ, గౌరవ అధ్యక్షుడిగా సత్యం, గౌరవ సలహాదారుడిగా గోపికృష్ణశర్మ ఎన్నికైయ్యారు.

భక్తాంజనేయ ఆలయ కమిటీ...

పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో గల శ్రీ భక్తాంజనేయ ఆలయం నూతన కమిటీ ఎన్నికలను గౌరవ అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లింగగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా రామోజీ దశరథ్, ప్రధాన కార్యదర్శిగా ఆత్మచరణ్, కోశాధికారిగా డీకొండ కిషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ కౌన్సిలర్ లింబాద్రిగౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో రోటరీ క్లబ్ నూతన భవనం ప్రారంభం



ఆర్మూరటౌన్: పట్టణంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నూతన భవనాన్ని పాస్ట్ డ్రిస్ట్రిక్ గవర్నర్ ఎన్వీ హనుమంత్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. రోటరీ అధ్యక్షుడు రజనీష్ కిరాడ్, జనరల్ సెక్రటరి రాస ఆనంద్ కష్టపడి భవన నిర్మాణాన్ని పూర్తిచేయడంతో వారిని ఆయన అభినందించారు. భవన నిర్మాణానికి సహకరించిన సభ్యులను సన్మానించారు. కాంతి గంగారెడ్డి, పుష్పకర్‌రావు, విజయసారథి, విద్యా గోపికృష్ణ, పట్వారి తులసి, చెలిమెల రాజేందర్, రాధాకిషన్, ఖాందేశ్ సత్యం, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు శివాలయంలో పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పలకీసేవ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు







పిప్రిరోడ్డులో వంగిపోయిన విద్యుత్ స్తంభాలు, జిరాయత్ నగర్‌లో ఇంటికి ఆనుకొని ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు, ఓ ఇంటి పైనుంచి వెళ్తున్న 33కేవీ విద్యుత్ లైన్

- ఇళ్లపైనుంచి వెళ్తున్న వైనం
- ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో భయపడుతున్న ప్రజలు

ఆర్మూర్‌టౌన్ : పట్టణంతో పాటు మున్సిపల్ పరిధిలో హైటెన్షన్ విద్యుత్ తీగలు ఇంటి పైనుంచి వెళ్తుండటంతో స్థానికులు భయపడుతున్నారు. ఈదురు గాలులు వీచినపుడు విద్యుత్ తీగలు ఒకదానికి ఒకటి రాపిడి జరిగి నిప్పు రవ్వలు చెలరేగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. పట్టణంతో పాటు ఆలూరు బైపాస్‌లోని ఇంటి సమీపంలో, జిరాయత్ నగర్‌లో 11 కేవీ, 33కేవీ లైన్‌లు వెళ్తున్నాయి. అలాగే విద్యుత్ స్తంభాలు ఒకవైపు వంగి ప్రమాదకరంగా ఉన్నాయి.విద్యుత్ తీగల ఎత్తు పెంచాలని స్థానికులు కోరుతున్నారు

గతంలో జరిగిన ఘటనలు

- కొన్ని రోజుల క్రితం పట్టణంలోని ఆలూరు బైపాస్ రోడ్డు వద్ద ఓ వ్యక్తి తన ఇంటి సమీపంలో ట్రాక్టర్‌కు వెల్డింగ్ చేసుకున్న తర్వాత 33కేవీ విద్యుత్ వైర్ తగలడంతో గాయాలపాలయ్యాడు.
- ఈ నెల 24న ఆలూర్ మండలం కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాల పక్కన నుంచి వెళ్తున్న తీగల ద్వారా ఓ విద్యార్థి బంతి కోసం వెళ్లి విద్యుత్ షాకుకు గురై గాయపడ్డాడు.

అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ తీగల ఎత్తును పెంచాలి

ఇంటి పరిసరాలపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలను తొలగించి వాటిని ఎత్తు పెంచి ప్రమాదాలు జరగకుండా చూడాలి. ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందో భయంగా ఉంది.

– మనీషా, ఆర్మూర్

ప్రమాదకరంగా స్తంభాలు

ఆర్మూర్ పట్టణంతోపాటు పలు గ్రామాల్లో కూడా విద్యుత్ స్తంభాలు ఒకవైపు వంగి ప్రమాదకరంగా ఉన్నాయి. అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలను సరిచేసి ప్రమాదాలు జరగకుండా చూడాలి.

– అరుణ్, ఆర్మూర్

మరమ్మతులు చేస్తున్నాం

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను మరమ్మతులు చేపడుతున్నాం. కిందకు వేలాడుతున్న తీగలను సరిచేస్తున్నాం. అలాగే విద్యుత్ స్తంభాల ఎత్తును పెంచుతున్నాం. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలి.

– జి. కృష్ణ, ఏడీఈ, ఆర్మూర్

గ్రామ దేవతలకు జలాభిషేకం

ఆర్మూర్‌టౌన్/వేల్పూర్/బాల్కొండ : ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం వీడీసీల ఆధ్వర్యంలో గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. ఆలూర్ మండల కేంద్రంలో, మెండోరా మండలం బుస్సాపూర్, మెండోరా, ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామాల్లో, వేల్పూర్ మండలం పడగల్‌లో గ్రామస్తులు గోదావరికి కాలినడకన వెళ్లి గంగనీళ్లను తీసుకువచ్చారు. అనంతరం గ్రామాల్లో డప్పు వాయిద్యాలు, వలగొడుగుతో ఊరేగింపు నిర్వహించారు. వర్షాలు బాగా కురవాలని, రైతులకు పంటలు బాగా పండాలని కోరుకుంటూ ప్రతి ఏడాది రెండు సార్లు గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని వీడీసీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వీడీసీ, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.



ఆలూర్‌లో వల గొడుగుతో గంగనీళ్లను తీసుకెళ్తున్న వీడీసీ సభ్యులు



ముప్కాల్ మండలం కొత్తపల్లిలో..

ఏఆర్‌పీ క్యాంప్‌లో పోచమ్మ తల్లి బోనాలు

బోధన్ : ఎడపల్ల మండలంలోని ఏఆర్‌పీ క్యాంప్‌లో మాల కులసంఘం ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. డప్పువాయిద్యాలతో మహిళలు బోనాలెత్తుకుని పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కులపెద్దలు, సభ్యులు పాల్గొన్నారు. బోధన్ పాన్‌గల్లి కాలనీ మున్నూరు కాపు కులస్తులు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకుని డప్పువాయిద్యాలతో స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో గల మహాలక్ష్మి మందిరం వరకు ఊరేగింపుగా వెళ్లారు.



బుస్సాపూర్‌లో ..



బోధన్‌లో బోనాలతో వెళ్తున్న మహిళలు

వామపక్ష పార్టీ నాయకుల ముందస్తు అరెస్ట్

బోధన్/ఆర్మూర్‌టౌన్/వర్ని/మాక్లూర్/నవీపేట : జిల్లా కేంద్రంలో జాతీయ పసుపు బోర్డు ప్రారంభించేందుకు కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా రాక నేపథ్యంలో పలు చోట్ల వామపక్ష పార్టీల నాయకులను ఆదివారం ఉదయం పోలీసులు అరెస్టు చేశారు. బోధన్‌లో వామపక్ష పార్టీల నాయకులు, బీ.మల్లేష్, శంకర్ గౌడ్, యేశాల గంగాధర్, సీతారాం,ఆమ్ ఆద్మీ పార్టీ పట్టణ అధ్యక్షుడు జునైద్ అహ్మద్,పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు గౌతం కుమార్, ఏఐపీఎస్‌యూ ప్రతినిధి సాయికుమార్‌లను పోలీసులు అదుపులోకి తీసుకొని ముందస్తు అరెస్ట్ చేశారు. మధ్యాహ్నం తర్వాత విడిచిపెట్టారు. అలాగే వర్నిలో ఉపాధిహామీ ఫీల్డ్‌అసిస్టెంట్లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.మాక్లూర్ మండలానికి చెందిన సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులైన దుడ్డు గంగాధర్, దేశెట్టి సాయిరెడ్డిలను పోలీసులు అరెస్టు చేశారు. నవీపేటలో టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్, సీపీఎం జిల్లా నాయకులు పెద్ది వెంకట్రాములను అరెస్టు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీపీఐఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా పార్టీ నాయకులను ముందస్తు అరెస్టు చేయడం అప్రజాస్వామ్యమని సీపీఐఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా పార్టీ ఆర్మూర్ సబ్ డివిజన్ కార్యదర్శి కిషన్, అన్నారు. పట్టణంలోని కుమార్‌నారాయణ భవన్‌లో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ, సీపీఎం నాయకులు వామపక్ష పార్టీ నాయకుల అరెస్టులను ఖండించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



బోధన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వామపక్ష పార్టీల డివిజన్ ప్రతినిధులు

జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను కలిసిన నాయకులు

బోధన్/ఆర్మూర్‌టౌన్/మాక్లూర్ : జిల్లా కేంద్రంలో ఆదివారం పసుపు బోర్డు ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వచ్చారు. ఈసందర్భంగా మంత్రి సీతక్కను ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు గంగాశంకర్, బిల్ల రాంమోహన్‌లు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఆర్మూర్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీతక్కకు వినయ్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో మాక్లూర్ మండల కాంగ్రెస్‌పార్టీ నాయకులు మంత్రి సీతక్కను కలిసి సన్మానించారు. అలాగే మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును బోధన్ నియోజకవర్గ, మాక్లూర్ మండల కాంగ్రెస్ నాయకులు కలిసి సన్మానించారు.





మంత్రి సీతక్కను సన్మానిస్తున్న ఆర్మూర్ కాంగ్రెస్ నాయకులు, బోధన్ కాంగ్రెస్ నాయకులు



మాక్లూర్ కాంగ్రెస్ నాయకులు

సంక్షిప్తం

నేడు బోధన్‌లో జగన్నాథుడి రథయాత్ర

బోధన్ : పట్టణ కేంద్రంలో తొలిసారిగా : ఇస్కాన్ భక్తి కేంద్రం నేతృత్వంలో సోమవారం జగన్నాథుని రథయాత్ర జరగనుందని నిర్వహకులు తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, భగవద్దర్శన్ మాసపత్రిక సహ సంపాదకులు డాక్టర్ వైష్ణవాంఘ్రి సేవక్ దాస్ విచ్చేస్తున్నారు. పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి 10 వేల మంది వరకు భక్తులు రథయాత్రకు రానున్నారని నిర్వాహకులు వెల్లడించారు.

దరఖాస్తుల ఆహ్వానం

బోధన్: రాష్ట్ర గురుకుల ఎడపల్లి (బాలికలు), పోచంపాడ్ (బాలికలు,బాలుర) పాఠశాలల్లో 6,7,8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని గురుకుల పాఠశాల,కళాశాలల జిల్లా కన్వీనర్, ఎడపల్లి గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ ఎన్.గంగాశంకర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి జూలై 2 వరకు దరఖాస్తులను ఆయా పాఠశాలల్లో సమర్పించాలన్నారు. వివరాలకు సెల్‌ఫోన్ 9866559697(ఎడపల్లి బాలికలు), 9701222079(పోచంపాడ్ బాలికలు),9866559693(పోచంపాడ్ బాలుర) నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

యూరియా కొరతపై బీఆర్ఎస్‌ను నిందించడం శోచనీయం



వేల్పూర్: యూరియా కొరతపై బాల్కొండ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని, బీఆర్ఎస్ పార్టీని నిందించడం శోచనీయమని బాల్కొండ నియోజకవర్గ సొసైటీల చైర్మన్‌లు అన్నారు. ఆదివారం వేల్పూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సొసైటీలు బకాయిలు ఉండడంతోనే యూరియా రావడం లేదనడం అవాస్తవమన్నారు. 2020లో తాము సొసైటీల బాధ్యతలు తీసుకునేటప్పటికీ అవి ఎంత బకాయిలతో ఉన్నాయో తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందన్నారు. కమ్మర్‌పల్లి, మోర్తాడ్, రామన్నపేట్, పడగల్, మోతె, సొసైటీ చైర్మన్‌లు దేవేందర్, బద్దం అశోక్, మోహన్‌రెడ్డి, మోతె రాజేశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

చంద్రబిన్ మహరాజ్ జన్మదిన వేడుక



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో భారత్ గ్యాస్ మేనేజర్ సుమన్ ఆధ్వర్యంలో ఆదివారం చంద్రబిన్ మహరాజ్ జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆయన చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు.ఆర్మూర్‌లోని నవనాథ సిద్దుల గుట్టపై 15 సంవత్సరాలు ఉండి పూజలు నిర్వహించారు. ఆ తరువాత మధ్యప్రదేశ్‌లోని నర్మదా నది పక్కన ఆశ్రమం నిర్మించారని సుమన్ తెలిపారు. జన్మదిన వేడుకల్లో భక్తులు పాల్గొని అన్నదాన ప్రసాదంను స్వీకరించారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలి



బాల్కొండ: ముప్కాల్ మండల బీఆర్ఎస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమించబడిన బద్దం నర్సారెడ్డిని ఆదివారం బాల్కొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సన్మానించారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో నాయకులు సామ వెంకట్‌రెడ్డి, అంజయ్య, రమేష్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి చిత్రం

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ



నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని అపోలో ఫార్మసీ ఎదురుగా గల మెయిన్ రోడ్డు నుంచి వీధిలోకి వెళ్లే రోడ్డులో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– స్వర్గం నర్సయ్య, రాజనగర్, నందిపేట

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్ : 99636 95349

శంకుస్థాపనకే పరిమితమా!

- వేంపల్లిలో ప్రారంభం కాని హెల్త్ సబ్‌సెంటర్ పనులు

బాల్కొండ : ముప్కాల్ మండలం వేంపల్లిలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం పనులు శంకుస్థాపనకే పరిమితమా అంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో 2023లో సబ్ సెంటర్ నిర్మాణం కోసం రూ. 20 లక్షల నిధులను మంజూరు కావడంతో పనులకు శంకుస్థాపన చేశారు. బిల్లులు సకాలంలో అందకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఇకనైనా అధికారులు, పాలకులు స్పందించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బుస్సాపూర్, దూదిగాంలో..

మెండోరా మండలం బుస్సాపూర్, దూదిగాం గ్రామాల్లో కూడా గత ప్రభుత్వ హయాంలోనే హెల్త్ సబ్ సెంటర్ భవనాల నిర్మాణాలకు రూ. 20 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. అక్కడ కూడా పనులు ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. ఎప్పుడు ప్రారంభమవుతాయో కూడా స్పష్టత లేదు. పాత ధరల ప్రకారం నిధులు మంజూరు కావడంతో నష్టాలు చవి చూసే ప్రమాదం ఉందని కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.



వేంపల్లిలో వేసిన శిలాఫలకం

త్వరలోనే ప్రారంభిస్తాం

ప్రాథమిక హెల్త్ సబ్‌సెంటర్ల భవనాల నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తాం. కాంట్రాక్టర్లతో ఉన్నతాధికారులు మాట్లాడుతున్నారు. గతంలో నిర్మాణాలు పూర్తి చేసిన వాటి బిల్లులు ఆలస్యం కావడంతోనే సమస్య వచ్చింది. కాంట్రాక్టర్లు పనులు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– షరీఫ్, పంచాయతీ రాజ్ ఏఈ, బాల్కొండ

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పెర్కిట్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని ఎంఆర్ గార్డెన్‌లో ఆదివారం ప్రజ్ఞ హైస్కూల్‌లో పదోతరగతి చదివిన 2007–08 బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. తమకు విద్యాబుద్ధి నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. తమ చిన్నానాటి పాఠశాల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

– ఆర్మూర్‌టౌన్



తల్లిదండ్రుల విగ్రహాలకు పూజలు

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన జక్క పోశెట్టి, జక్క రాజేశ్వర్, జక్క గంగాధర్‌లు తమ తల్లిదండ్రులైన జక్క గంగారాం, జక్క లసుంబాయిల విగ్రహాలను పంట భూ ముల వద్ద ఆరేళ్ల క్రి తం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం తల్లిదండ్రుల వర్ధంతిని నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా ఆదివారం కుమారులు, కూతుళ్లు తల్లిదండ్రుల విగ్రహాలకు పూజలు చేశారు.

నేడు సింగిల్ విండో గోదాం ప్రారంభం

రుద్రూర్: మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో నిర్మించిన సింగిల్ విండో గోదాంను సోమవారం ప్రారంభిస్తున్నట్టు విండో అధ్యక్ష, కార్యదర్శులు బి.సంజీవరెడ్డి, లక్ష్మణ్ తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ సలహదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు హాజరవుతున్నట్లు తెలిపారు. రైతులు సొసైటీ సభ్యులు సకాలంలో హాజరు కావాలని వారు కోరారు.